

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జి.యశస్విని ఎస్.వర్షిణి, పి.దివ్యలేఖన, ఎన్.వీణదరి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున రాష్ట్రస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థినిలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొననున్నట్టు గురువారం హెచ్‌ఎం జి.కనకదుర్గ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను హెచ్‌ఎం కనకదుర్గ, పోటీలకు కోచ్‌గా వ్యవహరిస్తున్న పీడీ గొలకోటి ఫణీంద్ర కుమార్, పీడీలు డి.సరస్వతి, టి.సునీత, వి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన గొల్లవిల్లి విద్యార్థినిలతో హెచ్‌ఎం

కోనసీమ రైతు కన్నీరు

- 76,709 ఎకరాల్లో వరిపై ప్రభావం
- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపు
- నష్టం అంచనాల్లో అధికారులు

ప్రజాశక్తి - అమలాపురం, రామచంద్రపురం

మొంథా తుపాను రైతుకు కన్నీరు మిగిల్చింది. వరి రైతులకు ఎక్కువగా నష్టం కలిగించింది. భారీ వర్షాలు లేకున్నా రెండు రోజులుగా బలమైన ఈదురు గాలుల కారణంగా వెన్ను విరిగి నేల నంటాయి. జిల్లాలో 1.67 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, 55,115 ఎకరాల్లో చేలు నేలకొరగా, 21,594 ఎకరాల్లో చేలు నీట మునిగాయి. మొత్తం 76,709 ఎకరాల్లో పంటపై తుపాను ప్రభావం చూపింది. 3,953.31 ఎకరాల ఉద్యాన పంటలు దెబ్బతినగా, 3,960 మంది రైతులకు చెందిన 3,379.90 ఎకరాల్లో అరటి నేలకొరిగింది. గెలలు కోతకు సిద్ధంగా ఉన్న అరటి తోట నేలనంటడం వల్ల ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. 558 మంది రైతులకు చెందిన 450.71 ఎకరాల్లో కూరగాయలు, 45 మంది రైతు లకు చెందిన 43.48 ఎకరాలలో బొప్పాయి, 62 మం ది రైతులకు చెందిన 39.53 ఎకరాలలో పువ్వులు, 32 మంది రైతులకు చెందిన 19.76 ఎకరాల్లో పసుపు, పది మంది రైతులకు చెందిన 7.90 ఎకరాలలో తమలపాకు పంటలకు నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం తుఫాను నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించిన నేపథ్యంలో గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాలు వేశారు. రామచంద్రపురం నియోజక వర్గంలో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర డైరెక్టర్ పిఎం.సత్యనారాయణ అన్నారు. మండలంలోని చోడవరం తదితర గ్రామాల్లో ఇటీవల సంభవించిన తుపానుకు నేలనంటిన వరి క్షేత్రాలను పరిశీలించారు. కోనసీమ వరి పరిశోధన కేంద్రాల సైంటిస్టులతో కలిసి సంయుక్తంగా ఆయన క్షేత్రస్థాయి అధ్యయనం చేశారు ఈ. సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అకాల వర్షాలు, తుపాన్లు వల్ల పంట అంతా నేలమట్టం అయిందని సుమారు 75 శాతం నుంచి 80 శాతం వరకు నష్టం కలిగిందన్నారు. రామచంద్రపురం మండలంలో 18800 ఎకరాల సాగు అవుతుండగా 13,800 ఎకరాల పంట నష్టం సంభవించిందని మండల వ్యవసాయ అధికారి మణిదీప్ తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 15, 600 వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతుండగా దానిలో 8,500 ఎకరాల్లో పంట నష్టం సంభవించి ఒదని, ఇది సుమారు 60 శాతం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి అన్నారు. పామర్రు, ఎండగండి, కూళ్ళ, సుందరపల్లి, దంగేరు, కోట గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో తుపాను కారణంగా జరిగిన వరి పంటలో నష్టాన్ని పరిశీలించారు.రైతులకు పలు సూచనలు చేశారు. **మామిడికుదురు:** మండల పరిధిలో 13గ్రామాలలో 2,707ఎకరాలు విస్తీర్ణంలో ఖరీఫ్ పంట రైతులు సాగు చేశారని వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు. తుపాను కారణంగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిలిందని అన్నారు.



కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్ట పరిధిలో కుళ్లుతున్న వరి చేను (ఇన్‌సెట్)లో చోడవరంలో దెబ్బతిన్న పంట పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి



కౌలు రైతులకు పంట పండించాలంటే అధికంగా ఖర్చులు అవుతున్నాయయి. మరో నెలలో పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న భారీ వర్షాలకు, తుపానులకు తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునే పంట నష్టపరిహారం అందించాలి.

-దొంగ మీరయ్య, కౌలు రైతు, ఎర్రపోతవరం

4కు మండల స్థాయి చెకుముకి సంబరాలు వాయిదా

ప్రజాశక్తి - రాజోలు

మొంథా తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాల వల్ల ఏర్పడిన అననుకూల పరిస్థితుల దృష్ట్యా నవంబర్1న నిర్వహించాల్సిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నవంబర్ 4వ తేదీకి వాయిదా వేసినట్లు రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. వారి ఆదేశాల మేరకు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కూడా మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నవంబర్ 4న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పివివి.వర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతీ మండల జనవిజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఈ మార్పును గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవలసిందిగా జిల్లా అధ్యక్షులు జె.సత్యనారాయణ తెలియజేశారు. వివరాలకు చెకుముకి కన్వీనర్ ఎన్.అబ్బులు సెల్: 9441562806, కో-కన్వీనర్ పి.నరసింహారావును సెల్: 91821 33985 ద్వారా సంప్రదించాలని తెలియజేశారు.

డ్రోన్లతో నిఘా వ్యవస్థ బలోపేతం

- ఎస్‌పి రాహుల్ మీనా
- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమం

ప్రజాశక్తి - అమలాపురం

డ్రోన్ల సాయంతో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా అన్నారు. జిల్లా ఆర్మ్ రిజర్వు కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమం జరిగింది. ఎస్‌పి రాహుల్ మీనా ప్రధాన అతిథిగా హాజరై మాట్లాడుతూ పోలీసు శాఖలో ఆధునిక పరికరాల వినియోగం పెరుగుతోందన్నారు. ప్రజలకు పోలీసుల పట్ల విశ్వాసం పెం చడం లక్ష్యమని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.ఈ సందర్భం గా విద్యార్థుల కు పోలీసు పరికరాలు, ఆయుధాల ప్రదర్శన జరిగింది. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎవిఆర్‌పిబి.ప్రసాద్, డిఎస్‌పి సుబ్బరాజు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌పి, విద్యార్థులు

శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

ఇటీవల కర్నూలు జిల్లాలో వి కావేరి బస్సు దగ్ధమైన ఘటనలో రావులపాలెం నివాసి కొవ్వూరి శ్రీనివాసరెడ్డి మృతి చెందాడు. గురువారం మృతుని కుటుంబాన్ని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పరామర్శించారు. మృతుడు శ్రీనివాసరెడ్డి భార్య, కుమారుడు, కుమార్తెను ఎంఎల్‌ఎ ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి తగిన ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ దుర్ఘటన ఎంతో బాధాకరమని, కుటుంబానికి తన పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఎంఎల్‌ఎ తెలిపారు. ఎంఎల్‌ఎ వెంట గుత్తుల పట్టాభిరామారావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్‌ఎ

తీర గ్రామాల్లో కొవ్వొత్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మొంథా తుపాను నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో చెట్లు పడిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో తీర గ్రామాల్లో గురువారం కొవ్వొత్తులు పంపిణీ చేశారు. సముద్ర తీర గ్రామాలైన వాసాలతిప్ప, ఎస్.యానం, ఎన్.కొత్తపల్లి, రాఘవులుపేట తదితర గ్రామాల్లో తహశీల్దార్ విఎస్.దివాకర్ కొవ్వొత్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలగుప్తం తహశీల్దార్ దివాకర్ మాట్లాడుతూ తుపాను సమర్థవంతంగా ఎదుర్కో వడంలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. అధికార యంత్రా ంగాన్ని ప్రజలను అప్రమత్తం చేసే నష్టనివారణ తగ్గించారని ఆన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' కార్యాలయంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక యువతకు పారిశ్రామిక సేవా రంగాలలో ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించే లక్ష్యంతో ఈ నెల 31వ తేదీ శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంత లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పనే ధ్యేయంగా శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి స్థానిక ఉపాధి కల్పనా కార్యాల యం నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్హతలు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల, బయోడేటా జిరాక్స్ కాపీలతో అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని ఆమె స్పష్టం చేశారు. సహాయం కొరకు ఫోన్ నెంబర్: 8978 905032లో సంప్రదించగలరని అన్నారు. ఈ మేళాలో ప్రయివేటు రంగ సంస్థల్లోని అనేక ఖాళీల భర్తీకి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని అన్నారు. పదో తరగతి /ఐటిఐ, ఇంటర్మీడియట్ /డిగ్రీ/ఐటీఐ/డిప్లొమా/ బిటెక్ సమాన విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతి, యువతులు అర్హులన్నారు. ఫ్రెషర్స్, అనుభవజ్ఞులిద్దరూ పాల్గొనవచ్చునని అన్నారు. ప్రఖ్యాత ప్రయివేటు సంస్థలు ప్రాతినిధ్యం వహించనున్నాయని అన్నారు. అభ్యర్థులు వారి విద్యా ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బయోడాటా ఆధార్ కార్డ్‌తో హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని భవిష్యత్తుని ఉత్తమంగా తీర్చిదిద్దుకోగలరని జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంత లక్ష్మి ఆకాంక్షించారు.

ముంపు సమస్యపై రైతుల సమావేశం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

తుపానులు వరదలు భారీ వర్షాలు తరచూ సంభవిస్తున్న నేపథ్యంలో రైతాంగం తీవ్రంగా నష్టపోకుండా ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం రైతులు నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకు గొల్లవిల్లిలో రైతు నాయకుడు అడబాల సత్యనారాయణ ఇంటి వద్ద గురువారం రైతు పరిరక్షణ సమితి అధ్యక్షులు యాళ్ళ బ్రహ్మానందం అధ్యక్షతన రైతు సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మురుగు కాలువల్లో విపరీతంగా పూడిక పెరిగిపోవడం మురుగు కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వరిచేలల్లోని ముంపు నీరు దిగక ఏటా రైతులు నష్టపోవడం ఆనవాయితీగా మారిపోయిందని అన్నారు. సమస్యను బుధవారం అల్లవరం మండలం తుపాను నష్టాల పరిశీలనకు వచ్చిన సిఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకువెళ్లడంతో సిఎం చంద్రబాబు స్పందించి రైతులతో కలెక్టర్, డ్రెయిన్స్, ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖల ఉన్నతాధికా రులతో సమావేశం జరిపి ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోమని ఆదేశించడం హర్షణీయమని అన్నారు.ఈ నేపథ్యంలో అధికారులతో సమావేశం అయ్యేందుకు సన్నద్ధమవుతున్నాని అన్నారు. ఈ సందర్భంగా తుపానుకు దెబ్బతిన్న వరి చేలను మురుగు కాలువలను రైతు నాయకులు పరిశీలించారు. సమావేశంలో రాష్ట్ర అగ్రి మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, తెలుగు రైతు మండల అధ్యక్షులు పెమ్మిరెడ్డి సత్యనారాయణ,సాగు నీటి సంఘ అధ్యక్షులు నల్లా సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు మంచెం బాలకృష్ణ, రైతులు యెరుబండి రాంబాబు, మంచెం బుజ్జి, గుత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో దెబ్బతిన్న వరి చేలను రైతు నాయకుల పరిశీలన

వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలి


ప్రజాశక్తి - మామిడికుదురు

టెన్త్‌లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని సమగ్ర శిక్ష సిఎంఒ బివివి. సుబ్రహ్మణ్యం సూచించారు మామిడికుదురు హైస్కూల్‌ను గురువారం సందర్శిం చారు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయములో రాజీ పడకుండా నాణ్యమైన భోజనం వండి వడ్డించే విధముగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని అవగాహన చేసుకోవాలన్నారు ఆయన వెంట ఎంఇఒ వెంకన్నబాబు, హెచ్‌ఎం బి.చిరంజీవి, సిఆర్‌ఎం టి.రామ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



వందరోజుల ప్రణాళికపై సూచనలిస్తున్న సిఎంఒ

కార్టూ'నిజం'



చొప్పెల్లలో మినీ టోర్నడో విధ్వంసం



మినీ టోర్నోడో ప్రభావంతో నేలకొరిగిన భారీ వృక్షాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల శివారున ఉన్న నివాసాలపై మినీ టోర్నడో గురువారం ఉదయం విరుచుకు పడింది. దీంతో భారీ వృక్షాలు, పలు నివాసాల పైకప్పులు పేక మెడల్లా కూలాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ ఎ.రాజు, స్థానిక సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, విఆర్ఒ సూర్య ప్రకాష్ తదితరులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను ధైర్యం చెప్పారు.సాధారణంగా ఈ మినీ టోర్నడో నదులలో ప్రారంభమై భూమి మీదకు వచ్చేటప్పుడు అది వేగంగా కదులుతూ ఆ దిశలో ఉన్న వాటిని అతలాకుతలం చేస్తుంది. ఈ క్రమంలో పలువురికి చెందిన ఆర్‌సిసి బిల్డింగ్ వరండాల్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్లు, ఎసి యూనిట్లు, ఫ్రిజ్లు, తాత్కాలిక నివాసాలకు చెందిన ఐరన్ రేకులు దెబ్బతిని అందులో ఉన్న ఫర్నీచర్‌లకు నష్టాలు వాటిల్లాయి. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలు కావడంతో ఆయా బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అదే ప్రాంతంలో ఉన్న ఎస్‌సి కాలనీ, ఎంపిపి పాఠశాలలో చెట్లు పశువుల పాకలు, ఇటుక బట్టీలకు చెందిన షెడ్లు దెబ్బతిన్నాయి. ఇక్కడ ఇంకా వలస కూలీలు రాకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ సంఘటన ఎదుర్కొన్న వారంతా ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదని బాధితులంతా పేర్కొన్నారు. ప్రభుత్వంమమ్మల్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



మినీ టోర్నడో ప్రభావంతో ఎగిరిపోయిన ఇళ్లకప్పులు

కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు చర్యలు

ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి- మామిడికుదురు

రైతులు వ్యవసాయ ఉత్పత్తులు భద్రపరుచుకునేందుకు నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టామని ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మీ అధ్యక్షతన గురువారం జరిగిన పాలకవర్గ సమా వేశానికి ఎంఎల్‌ఎ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు అవసరమైన ప్రయివేటు స్థలము కొనుగోలు చేసే దిశ గా ప్రతిపాదనలు చేయాలని అన్నారు. ఛైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ ఉత్పత్తులు ప్రధాన రహదారికి తరలించేలా గ్రామాలలో అవసరమైన లింకు రోడ్లు, పంట కాలువలపై వంతెనలు గుర్తించి మార్కెట్ కమిటీ నిధులతో నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఎఎంసి ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా నగరం పిఎసిఎస్ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. తొలిసారిగా సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసరావుకు ఎంఎల్‌ఎ, ఛైర్‌పర్సన్, డైరెక్టర్లు పూలమాలలు వేసి సత్కరించారు. సమావేశంలో నగరం సర్పంచ్ జాలెంరమణ కుమారి, ఎఎంసి డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్

ప్రజాశక్తి - రాజోలు

సఖినేటిపల్లి లో ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో ప్రయివేటు ఎలక్ట్రీషియన్ యడ్ల శంకర్ మృతి చెందాడు. మృతుడు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ తెలిపారు. మొంథా తుపాను కారణంగా సఖినేటపల్లి సబ్ స్టేషను దగ్గరలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా జరిగిన ఈ ఘటన నన్ను కలిచి వేసిందని ఎంఎల్‌ఎ అన్నారు. అంతా సజావుగా జరుగుతుంది అనుకున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. గురువారం రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు యడ్ల శంకర్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ తరపున రూ.5 లక్షల నష్ట పరిహారం, అదే విధంగా యూనియన్ తరపున రూ.3 లక్షలు, అదే విధంగా మృతుని సతీమణికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంఎల్‌ఎ ఆదేశించారు.



శంకర్ పార్థివ దేహం వద్ద ఎంఎల్‌ఎ తదితరుల నివాళి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి - మండపేట

మొంథా తుఫాను ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండపేట మండలం, మారేడుబాక లో వ్యవసాయ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించి పంటపొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాయుడు గంగరాజు, పసలపూడి శ్రీనివాస్, ముత్యాల అన్నవరం, సాదె సుబ్బారావు, సిద్ధిరెడ్డి రామన్న, తీగిరెడ్డి ప్రశాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం :** మండలం లోని పలు గ్రామాల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టానికి గురైన వరిచేలను విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు నెక్కంటి బాలకష్ణ గురువారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటామంటూ కూటమి నాయకులు భరోసా ఇచ్చారు.



మారేడుబాకలో వరిచేలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

కాంస్య పతక విజేతకు అభినందన

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్ర టైక్వాండో స్కూల్ గేమ్స్ అండర్-19 పోటీలలో అంబాజీపేట క్రీడాకారిణి కె.సాయి దుర్గ క్యాంస పతకంసాధించినట్లు సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు గురువారం తెలిపారు. రైల్వే కోడూరులోఈ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో కోచ్‌లు భూషణం, పి.భార్గవి పాల్గొన్నారు. విజేత సాయిదుర్గని ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కె.సాయిరాం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ మరియు సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి సుబ్బారావు, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.



పెదపల్లలో వరి చేను పరిశీలిస్తున్న తహశీల్దార్

పారదర్శకంగా పంట నష్టం నమోదు

ప్రజాశక్తి - ఆలమూరు

మొంథా తుపాను ప్రభావంతో నష్టాలు వాటిల్లిన పంటలను గుర్తించి పారదర్శకంగా నమోదు చేయాలని తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని చింత లూరు, పెదపల్ల గ్రామాల పరిధిలోని వరి పంటలను సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయిలో వరి చేలను రైతులతో కలిసి పరిశీలిస్తూ వేగంగా నమోదులు చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్క రైతును వదలకుండా పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే వరితో పాటు ఉద్యాన వన పంటల నష్టాలను గుర్తించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు వి.వేణి, వీరన్న చౌదరి, విఆర్ఒలు రాజశేఖర్, ఉదయకుమార్ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

తుఫానుల ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ బికెఎస్ఎస్. వెంకట్ రామన్ అన్నారు. గురువారం మండలంలోని లొల్ల ఆదర్శ పాఠశాలలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్రప్రదేశ్ లో భాగంగా వివిధ పాఠశాలల చిన్నారులకు సీజనల్ ఫీవర్స్ రాకుండా హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా చిన్నారులు అంటూ వ్యాధుల బారిన పడకుండా వాటిపై సరైన అవగాహనను ఉపాధ్యాయులు కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పాఠశాల మరియు ఇంటి వద్ద నీరు నిలవ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, వాసుకి, సాయిరాం, గోవిందు, శ్యాం కుమార్ పాల్గొన్నారు.



హోమియో మందులు వేస్తున్న ఎంపిడిఒ

నష్టం అంచనాల రూపకల్పనపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమావేశం నిర్వహించి మొంథా తుపాను ఉపశమన చర్యలు, పంట నష్ట అంచనాల రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా నష్టపోయిన వారికి తాత్కాలిక ఉపశమనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, నిత్యావసరాలు రానున్న మూడు రోజులలో పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పున రావాస కేంద్రాలలో నిత్యావసర వస్తువులైన ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కందిపప్పు, పామ్ ఆయిల్, పంచదార ప్యాక్ చేసి పంపిణీ చేయాలని, 25 కేజీలు, బియ్యం మాత్రం చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేయాలన్నారు. అదేవి ధంగా ఐదు రోజులుగా వేట వేట కోల్పోయిన మత్స్యకారుల కు చేనేత రంగ కార్మికులకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని ఈ పాస్ ఎనేబుల్ పద్ధతిలో ఉచితంగా సరఫరా చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా పునరావాస కేంద్రాలను ఆశ్రయం పొందిన వారు సుమారు 30 వేల మంది వరకు ఉన్నారని వీరందరికీ ఆర్థిక సహాయం కుటుంబానికి రూ.3 వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.1000 చొప్పున అందించాలన్నారు. తీర ప్రాంత వ్యాప్తంగా 45 గ్రామాలలో సుమారు 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కేజీలు బియ్యం సంబంధించి మత్స్య అభివృద్ధికారుల జీవన భృతి కోల్పోయారని ధ్రువీకరణతో అదేవిధంగా చేనేత జౌళి శాఖ ధ్రువీకరణతో చేనేత రంగ కార్మికులకు ఉచితంగా అందించాలన్నారు. మూడు రోజులపాటు తుపాను ఉపశమన ప్రక్రియను సంబంధించిన ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఉపశమన పరిహారాలు అందించు ప్రక్రియలో స్థానిక తాశీల్దార్లు, ఎంపిడిఓ సమన్వయం సహకారం పొంది పారదర్శకంగా బియ్యం నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. సముద్రపు తీర ప్రాంతాలలో ఇతర జిల్లాల నుండి వలస వచ్చి తుపాను మూలంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల జీవన భృతికి ఉచితంగా బియ్యం అందించాలన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖలు పంట నష్టాలను అంచనా వేసి లెక్కించడానికి బృందాలను నియమించాలని ఆదేశించారు. పంట నష్ట అంచనాలు శాస్త్రయుక్తంగా వ్యవసాయ శాస్త్రజ్ఞుల నిబంధనలు పరిగణనలోకి తీసుకొని గణించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రాథమిక అంచనాగా సుమారు 31 వేల ఎకరాలలో వరి పంట దెబ్బతిందని గుర్తించినట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామ వ్యవసాయ సహాయకులు వ్యవసాయ అధికారులు శాస్త్రజ్ఞుల ద్వారా బృందాలను నియమించి పంట నష్ట అంచనాలు రూపొందించాలన్నారు. పంటలు సాగు చేసే నష్టపోయిన రైతులు కౌలు దారులకు మాత్రమే పరిహారం అందేలా చూడాలన్నారు. తుపాను నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ 50 శాతం రాయితీతో పశుదాణా సరఫరా చేసేలా 800 టన్నులు సిద్ధం చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పశు వైద్యశాలలు పశువుల డ్యామేజీలను గణించాలన్నారు. అలాగే పశుపోషకులను గణించాలన్నారు. మత్స్య శాఖ ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు జెట్టీలు, హార్బర్ల డ్యామేజీలను గణించాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ దెబ్బతిన్న గృహాల అంచనాలను గణించాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం వారు సిపి డబ్ల్యుఎస్, సింగిల్ విలేజ్ స్కీములు ఓవర్ హెడ్ ట్యాంకులు పైప్ లైన్లు, జనరేటర్లు వంటి నష్టాలను గణించాలన్నారు. పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ వారు డ్యామేజ్ రోడ్లు వంతెనలు నిర్దేశిత ప్రొఫార్మాలో కిలోమీటర్ల వారీగా గణించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ 47 పాఠశాలల్లో డ్యామేజీలను ఆటస్థలం కాంపౌండ్ వాల్ తో సహ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఇంజినీర్ల ద్వారా అంచనాలు రూపొందించాలన్నారు. ఐసిడిఎస్ వారు అంగన్‌వాడీ కేంద్రాలు, అంగన్‌వాడీ కార్యాలయాల డ్యామేజీలపై నివేదికలో సమర్పించాలని అన్నారు. జలవనరుల శాఖ ఇంజనీర్లు లాకులు కాలువ గట్ల షట్టర్ల డ్యామేజీపై నివేదికలు రూపొందించాలన్నారు. డ్రైనేజీ శాఖ ఇంజనీర్లు డ్రైనేజీల్లో పూడికతీత షట్టర్ల రిపేర్లు డ్యామేజీలను లెక్కించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పిహెచ్‌సి, సిహెచ్‌సి ఆరోగ్య కేంద్రాలు డ్యామేజీలను విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు కండక్టర్ల డ్యామేజీలను రూపొందించాలన్నారు. అధికారులు తమ హెచ్‌ఒడిలకు, కలెక్టర్‌కు నివేదించే అంచనాలు ఒకే విధంగా ఇటువంటి వ్యత్యాసాలకు తావు లేకుండా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఐదు రోజుల లో ఈ నివేదికలు రూపకల్పన చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు కె.మాధవి, పి.శ్రీకర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైకుకు దుండగుల నిప్పు

ప్రజాశక్తి - గోపాలపురం

రాయల్ ఎన్ఫీల్డ్ బైకుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి సోమవారం తెల్లవారుజాము సమయంలో కొవ్వూరుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు జొన్నాడ మురళీ తెలిపిన వివరాలు ప్రకారం...తన స్వగ్రామం కొవ్వూరుపాడులో నివాసం ఉంటున్నట్లు తెలిపాడు. ఈ నెల 27వ తేదీ సోమవారం తెల్లవారు జాము అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై డీజిల్ పోసి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగడంతో ఎదురింటి వాళ్లు కేకలు పెట్టడంతో మెలుకువ వచ్చి మంటలను అదుపు చేశామని తెలిపారు. దీనిపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన మద్దుకూరి సత్యనారాయణ(53) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గురువారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు వెల్లడించారు. గురువారం ఉదయం ఇంటి నుంచి తన పొలంలోకి వెళ్తుతుండగా మార్గమధ్యంలో వేరొకరి పొలంలో విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరుపై తాడి చెట్టు పడింది. ఆ వైరు నీటి బోదెకు అడ్డంగా ఉండటంతో ఆ వైరును పక్కకు వేసేందుకు చేత్తో పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురియై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. మతునికి భార్య నాగమణి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబురావుకు చెందిన కోళ్లను దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో నాటు కోళ్లను దొంగిలించిన ఆవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.30 వేలు విలువ చేసే కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీలపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారులో దండగుండ ఇసుక ర్యాంపులో నకిలీ ధృవీకరణ పత్రాలతో తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను తరలిస్తున్న మూడు లారీలపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. ఈనెల 23వ తేదీన గనులు భూగర్భ శాఖాధికారి ఫణి భూషణ్‌రెడ్డి, ఇతర విజిలెన్స్ అధికారులతో కలిపి ర్యాంపులో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ధృవీకరణ పత్రాలు లేకుండా ఉన్న మూడు లారీలను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రసాయన వాయువుల లీకేజీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారుణ ఉన్న గ్రామం ఇండియా టోల్ ప్లాజా వద్ద ట్యాంకర్ లారీ నుంచి హైడ్రోక్లోరైడ్ ఆమ్లం లీకేజీ అవుతుండడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. బలబద్రపురంలో గ్రాసింగ్ ఇండస్ట్రీస్ నుంచి చెన్నై వెళుతున్న ట్యాంకర్ లారీ కొవ్వూరు వచ్చేసరికి హెచ్‌సిఎల్ గ్యాస్ లీక్ అవుతుంది. టోల్ ప్లాజా వద్దకు వచ్చేసరికి గ్యాస్ లీకేజ్ అధికంగా ఉండి పొగలు వచ్చుచుండడంతో ఆ ప్రాంతంలో ఉన్నవారికి వాంతులు, కళ్ళు మంట తలనొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. దీంతో టోల్ ప్లాజా మేనేజర్ జితేంద్ర రాణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం కెనాల్ రోడ్డు ప్రధాన రహదారికి పడిన గోతులు వర్షపు నీటితో గురువారం ఆటో బోల్తా పడింది. కాకినాడ ప్రధాన రహదారికి సామర్లకోట మండలం వికె.రాయపురం నుంచి మాధవ పట్టణం దాటేంత వరకు విపరీతంగా గోతులు పడగా గురువారం తెల్లవారు జామునుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ గోతులన్నీ నీటితో నిండుకున్నాయి. కాగా ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్న ఒక ఆటో గోతిలో పడి ప్రమాధానికి గురైంది. దీంతో ఈ రహదారిపై వెళుతున్న వాహనదారులు భయంతో రాకపోకలు సాగించారు.


దీక్షలో పాల్గొన్న మహిళలు

రవికుమార్ దీక్షకు మహిళల సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్షకు పలువురు మహిళలు సంఘీభావం తెలిపారు. స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష గురువారం 20 రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో పాల్గొన్న పోతుల భారతి మాట్లాడుతూ రవి కుమార్ ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు మూడు వారాలుగా దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో పోతుల హేమ సుందర రావుతో పాటు దొగ్గి పుష్పావతి, ఇసుకపట్ల దమయంతి, పోతుల సావిత్రి, గోడి అచమణి, లలిత, లక్ష్మీ, మహాలక్ష్మి, శాంతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి మండల విద్యా వనరుల కేంద్రంలో నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలములోని పదకొండు ఉన్నత పాఠశాలల్లోని 9, 10 తరగతుల విద్యార్థులు 40 మంది హాజరయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో వై.పూజా షణ్ముఖ ప్రియ ముక్తేశ్వరం ఉన్నతపాఠశాల (ప్రథమ స్థానం), ఎం.శాలిని సత్య పద్మ ఉన్నత పాఠశాల వీరవల్లిపాలెం (ద్వితీయ స్థానం), వక్తృత్వంలో పి.సాఖ్యప్రదాయిని ఉన్నత పాఠశాల కొండుకుదురు (ప్రథమ స్థానం), అప్పారి వేదవల్లి ఉన్నత పాఠశాల ముక్తేశ్వరం (ద్వితీయ స్థానం), క్విజ్ పోటీలో బి.యశ్విన్, ఎస్.చరణ్, ముక్తేశ్వరం ఉన్నతపాఠశాల విద్యార్థులు విజేతలుగా ఎన్నికై నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు మెల్లం శ్రీనివాసరావు పెచ్చెట్టి శ్రీనివాసు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాగం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె.వెంకటాచార్య, ఉపాధ్యాయులు జి.సాయి శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎస్‌జి ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ స్థాయిలో జరిగిన అండర్-17 చెస్ పోటీల్లో మెర్లపాలెం గ్రామానికి చెందిన మెర్ల సత్య సాయిరమ జిల్లా స్థాయికి ఎంపికైంది. ఊబలంక ఎస్‌విజి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న సాయి రమ కొత్తపేటలో డివిజన్ స్థాయి లో చెస్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ లో జరుగు జిల్లా స్థాయి చెస్ పోటీలలో విద్యార్థిని పాల్గొననుంది. విద్యార్థిని సత్య సాయి రమను హెచ్ఎం ఎస్.కిషోర్, డైరెక్టర్ వై.రామకృష్ణ, పిఇ.టి మాస్టర్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, గట్టి బ్రహ్మాజీ తదితరులు అభినందించారు

యోగాలో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని డాక్టర్ బొబ్బా జయశ్రీ జడ్‌పి గర్ల్స్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పసుపులేటి లక్ష్మీ శ్రీవిద్య గురువారం కొత్తపేట డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలలో యోగాలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి గేమ్స్‌కి ఎంపికైంది. దీంతో విద్యార్థిని లక్ష్మీ శ్రీవిద్యను మరింత ఉన్నత విద్య, ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హైస్కూల్ హెచ్ఎం కె.ఉమ, ఫిజికల్ డైరెక్టర్లు ఎన్.ప్రసన్న కుమారి, జి.రాజ్యలక్ష్మి , ఉపాధ్యాయ బృందం , విద్యా కమిటీ, అభివృద్ధి కమిటీ, తదితరులు అభినందనలు తెలియజేశారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మృతుల కుటుంబాలకు మంత్రి సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల ద్రాక్షారామ గ్రామానికి చెందిన దొంగల భీమశంకరం భీమేశ్వరాలయంలోని కాలభైరవ స్వామి ఆలయం సమీపంలో పని చేస్తూ విద్యుత్ షాక్ కు గురై మరణించారు. ఆ కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.25 వేల సాయం చేశారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ఇఒ, సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని తన నెల జీతంతో పాటు, ఆలయ సిబ్బంది వ్యక్తిగతంగా సమకూర్చిన రూ.2 లక్షలు వెరసి రూ.2.25 లక్షల మంత్రి సుభాష్ ద్వారా ఆ కుటుంబానికి అందించారు. అలాగే రామచంద్రపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో బుధవారం విద్యుత్ ఘాతానికి గురై బూర్ల చైతన్య కృష్ణ మరణించాడు. మృతుని కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.25 వేలు, మంత్రి సూచన మేరకు జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ రూ.10 వేలు, చందమామ వాసు మరో రూ.15 వేలు వెరసి రూ.50 వేలు మృతుని తండ్రి రాంబాబుకు అందించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు చందమామ వాసు, టేకిమూడి సత్యనారాయణ, కంచుమర్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు కృషి

ప్రజాశక్తి - రావులపాలెం

మొంథా తుపాను కారణంగా కొత్తపేట నియోజకవర్గ నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం తరపున అన్ని విధాల కృషి చేస్తామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి పంట, అలాగే 1500-2000 ఎకరాల్లో అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల తోటలు దెబ్బతిన్నాయని వివరించారు. కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, పల్లి యేసు, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, కాసా సాగర్ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మొంథా తుపానుతో దెబ్బతిన్న వరి, ఉద్యాన, కూరగాయల పంటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు అన్నారు. నర్సిపూడిలో గురువారం ఆయన తుపాను కారణంగా నష్టపోయిన వరిచేలను క్షేత్ర స్థాయిలో ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబులతో కలిసి పరిశీలించారు.

చంటియ్య కుటుంబానికి పాపారావు పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపళ్ళకు చెందిన మూరా చంటియ్య ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు పలువురు ప్రముఖులతో కలిసి గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చంటియ్య చిత్రపటం వద్ద వారంతా నివాళులర్పించారు. చంటియ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సీనియర్ నాయకులు నెక్కింటి బుజ్జి, చిర్ర శ్రీనివాస్, తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల జిల్లాస్థాయి స్వచ్ఛత అవార్డు స్వీకరించిన మండలంలోని జొన్నాడకి చెందిన 184 నెంబర్ అంగన్వాడి కేంద్రం టీచర్ గెద్దాడ ఆదిలక్ష్మిని, హెల్పర్ పద్మావతిని సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో కార్యదర్శి సుభాష్, నేత కట్టా సత్య ప్రసాద్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

స్పేస్ వీక్‌కు జిల్లా నుంచి నలుగురి ఎంపిక

ప్రజాశక్తి - అమలాపురం

స్పేస్ వీక్ - సైన్స్ ఎక్స్పో జర్ అండ్ ఎడ్యుకేషనల్ టూర్ టు ఢిల్లీ కార్యక్రమానికి, జిల్లా నుండి నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని డిఇఒ షేక్ సలీం బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకు కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఎంపికయ్యే ఈ కార్యక్రమానికి, అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి కె.గంగవరం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పైదికొండల రాజేశ్వరి, అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని రచకొండ సంజన నాగ సూర్య ప్రణవి, కె. గంగవరం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.జ్ఞానపూర్ణదేవి దీక్షిత, వీరవల్లిపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంహెచ్ఎస్‌వి.అనూష ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులు నవంబర్ 6 నుంచి 8 వరకు ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నాసా ఇంజనీర్ స్టేమ్ ఎడ్యుకేటర్ గేబె వారి ఆధ్వర్యంలో ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రాక్టికల్ సైన్స్ వర్క్‌షాప్స్‌లో పాల్గొనే అపూర్వ అవకాశం దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా నెహ్రూ ప్లానిటోరియం, నేషనల్ సైన్స్ మ్యూజియం, రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చర్ వంటి జాతీయ స్థాయి విజ్ఞాన సంస్థలను సందర్శించనున్నారన్నారు. ఈ పర్యటన విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం, సజనాత్మకత, పరిశోధనా మనోభావం పెంపొందించే దిశగా మైలురాయిగా నిలవనున్నదన్నారు.

నేషనల్ కిక్ బాక్సింగ్‌కు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన ఎపి కిక్ బాక్సింగ్ పోటీలలో ఇండియా ఉమెన్స్ సెల క్షన్స్ నందు మండలంలోని జొన్నాడకి చెందిన వారియర్ మాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ కె.సత్తిబాబు తెలిపారు. విజేతల వివరాలు అండర్ 9 విభాగంలో 21 కేజీలకు సంబంధించి మారిశెట్టి స్నేహ ఉష సిల్వర్ మెడల్, అండర్ 11 విభాగంలో 32కేజీలకు సంబంధించి కర్రీ బాల శ్రీ నందిని బ్రాంజ్ మెడల్, అండర్ 14 విభాగంలో 50కేజీలకు సంబంధించి నిట్టూరి హర్షిత గోల్డ్ మెడల్, 35కేజీలకు సంబంధించి కొత్తపేటకు చెందిన కలాటం శ్రీ మానస్వి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. వీరంతా డిసెంబర్లో జరగబోయే సౌత్ జోన్ నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. దీంతో విజేతలను గురువారం వారియర్ మాంక్స్ కుంగ్ ఫూ ఫౌండర్ ఎల్.వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సూర్యతేజ రెడ్డి, కోచ్ పి.నానిబాబు, శివ సురేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

నేతన్న భరోసా కింద రూ.25వేలు అందజేయాలి


ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మొంథా తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నేతన్న భరోసా కింద రూ.25 వేలు తక్షణమే విడుదల చేయాలని ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తుపాను బాధిత ప్రాంతాల్లో నివసిస్తున్న చేనేత కార్మికులు అందరూ కూడా చేనేత వత్తి చేసుకోవడానికి వీలుకాక అన్ని చేనేత కుటుంబాలు మొంథా తుపాను వల్ల ఉపాధి కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో చేనేత దినోత్సవం రోజు ప్రకటిస్తున్న నేతన్న భరోసా కింద రూ.25వేలు తక్షణం అందజేసి చేనేత కుటుంబాలను ఆదుకోవాలని సంఘం తరపున ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

'తుపాను బాధితులను పట్టించుకోని అధికారులు'

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మొంథా తుపాను ప్రభావానికి గురై అవస్థలు పడుతున్న కుటుంబాలను ప్రభుత్వ అధికారులు, ఎన్‌డిఎ కూటమి ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని రాజోలు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం సఖినేటిపల్లి మండలం కేశవదాసు పాలెం గ్రామంలో తుపాను కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో పార్టీ నాయకులు పర్యటించారు. నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షులు నల్లి ప్రసాద్ రావు మాట్లాడుతూ తుపాను ముందస్తు జాగ్రత్త చర్యలను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం, తుఫాను అనంతరం ప్రజలను గాలికి వదిలేసిందని విమర్శించారు. కేసుదాసుపాలెం, అంతర్వేదిక గ్రామాలల్లోని వందలాది ఇల్లు చుట్టూ నీరు చేరి సాధారణ జీవనానికి జీవనానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మూడు రోజులుగా కనీసం తాగునీరు లేదని, తుపాను బాధిత గ్రామాల్లో తక్షణసాయంగా బియ్యము కనీస అవసరాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా అధ్యక్షులు జాన్ మోసే భూసి అన్నారు. కేశవ దాసు పాలెం ఇందిరమ్మ కాలనీ ప్రజలు పరిస్థితి చాలా దీనంగా ఉందని ఇంతవరకు అక్కడికి రెవెన్యూ గ్రామ పంచాయితీ అధికారులు ఎవరు రాలేదన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు ముత్యాల శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆకుమర్తి భూషణం, నాయకులు చెవ్వాకుల వెంకట్, కత్తిమండ సురేష్, గుర్రం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో పాల్గొన్న పొన్నాడ సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తు నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్నాడ సతీష్‌కుమార్, పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు పితాని బాలకృష్ణ, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాశి మునికుమారి, పి. చిట్టి రాజు, జగత బాబ్జీ, కాశి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పట్టణం 20వ వార్డు వైసిపి కాలనీలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం ఇంటింటికీ తిరుగుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, పార్టీ ఐ టి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్న బాబు, బత్తిన దొరబాబు,షేక్ మస్తాన్,పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు తదితరులు, పాల్గొన్నారు.


మండపేటలో కోటి సంతకాల సేకరణలో చైర్‌పర్సన్ రాణి